


**దీపావళి. మా బావయ్య జీవితంలో దీపావళి.**

**మా అక్కయ్య జీవితంలో** అమావాస్య.

**ఆ రోజునవే** మా **బావయ్య** దాస్య శృంఖ**లను తెంచుకుని బయటపడ్డాడు.** ఆయన **నూటికి నూరుపాళ్ళు అహింసామూర్తి.**

**మా బావయ్య చాలా** పేద కుటుంబం**నుంచి వచ్చాడు. మంచి** తెలివితేటలు గల**వాడు. చదువులో ఆతడికి ఆ రోజుల్లో** అతడే **పాటి. మంచితనానికి,**హద్దు ఏమిటని ఎవరైనా **అడిగితే, మా బావయ్య** జీవితం, దానికి సమా**ధానం అని టకామని** చెప్పగలను.

**మా నాన్న బాగా** సంపాదించాడు.కర్రాడు **తెలివిగలవాడూ. బుద్ధిమంతుడూ,** చెప్పు **చేతుల్లో ఉంటాడని.** మా నాన్నగారు తన ఏకైక **పుత్రికారత్నాని** యిచ్చి, మా బావయ్య **మెడకు గుదిబండ కట్టారు.**

చదువుకు **ఆశపడ్డాడు** మా నాన్న. డబ్బుకు వాళ్ళు ఆశపడ్డారు. **మా బావయ్య** తెలివితేటల వల్లా, మా నాన్న **పలుకుబడివల్లా.** మా **బావయ్యకు** మంచి ఉద్యోగం వచ్చింది. డబ్బు **మాది....పలుకుబడి మాది....**కాబట్టే పెత్తనం **మా అక్కయ్యది.** నెల, నెలా వచ్చే జీతం **మీద, మా బావయ్య** కర్చులమీద, చివరకు **ఆయన తొడుక్కునే బట్టలమీద....**అన్నిం**టికీ** పెత్తనం **మా అక్కయ్యదే.** బనీను చిరిగింది....చొక్కా బెత్తు అయ్యింది....ఇంతటం **వరకే, మా బావయ్యకు ఉన్న** హక్కు, హద్దూను. ఎలాంటి బనీన్లూ, ఎలాంటి చొక్కాలూ, కొనాలనే, నిర్ణయం....హక్కూ మా అక్కయ్యదే. ఇది అంతా ఒక ఉదాహరణంగా చెబుతన్నా, అంతే.

ఒకరోజున మా బావయ్యను...."రేపు మీకు సెలవా..." అని అడిగాను.

"మీ అక్కయ్యను కనుక్కొని చెబుతానుండు...." అని టకామని చెప్పి లోపలకు వెళ్ళాడు.


ఆ రోజునుండీ, మా బావయ్య అంటే నాకు జాలి.

మా నాన్న అన్నా, మా అమ్మ అన్నా, ఆ మాటకొస్తే మా కుటుంబంలో ఎవరన్నా మా అక్కయ్యకు, వల్లమాలిన ప్రేమా, అభిమానమూ. మా నాన్న అంటే యిక చెప్ప నవసరంలేదు.

ఒకసారి జరుగరానిది జరిగింది. మా నాన్న ప్రక్కన, సోఫాలో, మా మామయ్య, అంటే మా బావయ్య నాన్నగారు కూర్చొన్నారట. మా అక్కయ్య అది చూసి మండిపోయింది. "ఆయన అంతస్తు ఏమిటీ, యీయన అంతస్తు ఏమిటీ....ఆయన ప్రక్కన కూర్చొంటాడా" అంటూ మా బావయ్య ముందు, మాఅక్కయ్య ఉరిమింది....శివతాండవంచేసింది.మా బావయ్య నోరు తెరిస్తే ఒట్టు. ఆ రోజున నాకు ఎవరు బావయ్యో....ఎవరు అక్కయ్యో....తికమక అయ్యింది.

నేనంటే కూడ మా అక్కయ్యకు అంత మంచి అభిప్రాయంలేదు. మా నాన్న సంపాదన్ను ఖర్చుపెట్టే సుపుత్రుడ్ని అనీ, సంపాదించటం చేతగానివాడ్ననీ మా అక్కయ్య ఉద్దేశ్యం. మూఢనమ్మకం, ఆమె నాపై వేసే అభాండాలు, అపనిందలూ, మా నాన్నతో తన నమ్మకాన్ని అనేకరకాలుగా, అనేకరంగులలతో కలిపి చెబుతూనే ఉండేది. కాని నేను ఒక్కగానొక్క కొడుకునవ్వటంవల్ల, పున్నామనరకం నుండి తప్పించవలసినవాడ్ని కాబట్టి, ఆమె పప్పులు ఉడకలేదు. ఆమె నా మీద పెత్తనం చేయలేకపోయింది.

కాలంతోపాటు, మా బావయ్యకు ప్రమోషన్లపై ప్రమోషన్‌లు వచ్చాయి. బంగళా, గేటు వద్ద గూర్ఖా, ఇంట్లో బొచ్చుకుక్క, పోర్టికోలో కారూ....అంతస్థు అలా పెరిగింది. మా అక్కయ్య....మేనేజింగ్ డైరెక్టర్ల ఇళ్ళను గురించీ, జడ్జిగారమ్మాయిలను గురించీ, కలెక్టరుగారి భార్యను గురించీ, వాళ్ళఅందరిలో తన ఆధిక్యతను గురించీ....అబ్బబ్బ....వినే వాళ్ళు ఉండాలేగాని గంటలు చాలవు....మొట్ట మొదటి స్నేహాలన్నీ పోయాయి. మనుష్యలను మర్చిపోయింది. ఎప్పుడైనా, వాళ్ళెవరైనా, ఎదురైపొరపాటున పూర్వపు పరిచయాన్ని గుర్తుచేస్తూ, మాట్లాడబోతే, తన అంతస్తును వాళ్ళకు గుర్తుచేసి, వాళ్ళతో మాట్లాడం తమకు నామార్దా అని వాళ్ళకు




తెలియ చేసేది.

మా అక్కయ్యకు, యిద్దరు కొడుకులు. వాళ్ళు చదువుల్లో వాళ్ళ తండ్రి అంతన్నా రనే చెప్పాలి. వాళ్ళనూ మా అక్కయ్య చాలా కట్టుదిట్టాలలో పెంచింది. అంత బ్రహ్మాండంగా, దిగ్విజయంగా, మా అక్కయ్య జీవితం నల్లేరుపై బండిలా సాగిపోతుంది....

ఇంతలో, మా నాన్న సడన్‌గా చని పోయారు. వీలునామా రాయలేదు. ఇది మా అక్కయ్యకు పెద్ద షాక్. మొట్టమొదటి ఘోర పరాజయం. తన ప్లాను దెబ్బతిన్నదే అనే పట్టరాని కోపం....ఎదురులేని తనకు, యీ మొదటి ఎదురుదెబ్బ పెద్ద గాయమయ్యింది. భరించలేకపోయింది. దాని పర్యవసానాన్ని మా బావయ్య, దేవుడులా భరిస్తూనే వుండే వాడు.

మా అక్కయ్య పెద్దకొడుకు, మా బావయ్య అక్క కూతుర్ని ప్రేమించి పెళ్ళి చేసు కున్నాడు. ఇది రెండవ ఘోరాపజయం, మా అక్కయ్యకు. "నేను ఆ అమ్మాయినే చేసు కుంటా....ఏది ఏమయినా సరే ..మీరెలా పోయినా సరే...." నన్నాడు. అణిగున్న అగ్నిపర్వతం పగిలింది. ఆ పెళ్ళికి నేనే పెద్దను వాడి తరపున. మా బావయ్యకూ రాలేదు. మా బావయ్యా, వాళ్ళ కుటుంబం, తనకు వ్యతిరేకంగా, తన పెత్తనాన్నీ, ఆధిక్యతనూ కాదనీ, తనను వాళ్ళ అదుపు ఆజ్ఞలలో ఉంచు కోవాలనీ తనపై కక్షకట్టి చేసిన పని' అని మా అక్కయ్య దృఢాభిప్రాయం. దానితో మరీ రెచ్చిపోయింది.

రెండవవాడు అమెరికా వెళ్ళాడు. వాడు వెళ్లేముందు, గొప్ప గొప్ప వాళ్ళందరికీ, డిన్నరు యిచ్చింది మా అక్కయ్య. వాళ్ళ అమ్మాయిలలో, ఒక అమ్మాయి, తరగని ఆస్తితో, అంతస్తుతో, తన ఇంటికి కోడలుగా వస్తుందనీ, అందరి గర్వాలూ అణుగుతాయని, అందరూ, అసూయతో, చస్తారనీ, ఆమె ఆశ. ఒకరోజున అక్కడ ఒక అమ్మాయిని కట్టు కుని, వాళ్ళ యిద్దరి ఫోటో పంపాడు. ఆ రోజున మా అక్కయ్యను చూడవల్సిందే. కాళికాదేవి ఎలా ఉంటుందో తెలిసేది.మూడవ యీ ఘోరాపజయాన్ని, శివుడు గరళం మింగి నట్టు మింగింది మా అక్కయ్య.

వీటన్నింటితో... అసలేకోతి... అందులో కల్లు తాగింది.... నిప్పుతొక్కింది.... అన్నట్టు. ఆ కోపం... యీ కోపం.... మా బావయ్య మీద చూపిస్తూండేది. భరించేవాడు కాబట్టే ఆయన భర్త, మా అక్కయ్య భార్య.

అందరూ ఉన్నారు.... ఆస్తి ఉంది.... అంతస్తుంది.... అన్నీ ఉన్నాయి.... ఏమి లాభం.... ఈ అపజయాలతో, మా అక్కయ్య ఆ యింటిని అశాంతి నిలయంగా చేసింది. పిల్లలకూ, వాళ్ళకూ, సంబంధం లేదు.... అప్పుడప్పుడు మా బావయ్యకు ఆఫీసుకు మట్టుకు ఉత్తరాలు వస్తుండేవి. అలాంటి ఒక ఉత్తరం, పొరపాటున, ఒకరోజున జేబులో పెట్టుకుని యింటికొచ్చాడు. అది మా అక్కయ్య కంటపడ్డది. తన పరమ శత్రువు, మా బావయ్యేననుకుంది. తన ఇంట్లోనే తన శత్రువు పాగా వెయ్యటాన్ని సహించలేక పోయింది ...దానితో, మా బావయ్య, మనస్సూ, మమత, మమకారాలూ వున్న మనిషేనని తెలుసుకునే జ్ఞానాన్ని కూడ పోగొట్టుకుంది. నోటికొచ్చినట్టు మాట్లాడటం సాగించింది... ఆమె నోటికి హద్దూ అదుపూ లేకుండా పోయింది. పిచ్చి ఎక్కిందేమోననిపించేది.

దీపావళి ముందురోజున, వాళ్ళ పెద్ద అబ్బాయి, తనను తన తల్లిదండ్రులు క్షమించు తారనీ, వాళ్ళ పసిబిడ్డను, తల్లిదండ్రులకు చూపించాలనీ, పెద్దవాళ్ళయిపోతున్నారు.... తండ్రి నేడో రేపో రిటయిరు అయ్యే టైము వచ్చింది, వాళ్ళను తీసుకెళ్ళి తన దగ్గరే ఉంచుకోవాలనీ....ఇలాంటి ఎన్నో కోరికలతో కొండంత ఆశతో....భార్యతో వచ్చాడు. మా అక్కయ్య యింట్లోకి అడుగుపెట్టనీయ లేదు. బంగళా బయటకు వెళ్ళకపోతే.... గూర్ఖాతో బయటకు గెంటుంచుతానంది. ఇష్టమొచ్చినట్టు తిట్టిపోసింది. గూర్ఖాను పిలిచి, వాళ్ళను బయటకు గెంటమంది.

మా బావయ్య మొట్టమొదటిసారిగా, మా అక్కయ్య గీచిన గీత దాటాడు. బయటకు వచ్చి, మనుమడ్ని చేతుల్లోకి తీసుకుని, కన్నీ ళ్ళతో, ముద్దుల వర్షం కుర్పించాడు. కొడు కునూ, కోడలనూ, కళ్ళారా చూశాడు. వాళ్ళ బిడ్డను వాళ్ళకు అప్పచెప్పాడు. తను ఇంట్లోకి వచ్చాడు. వాళ్ళు వచ్చిన దారినే వెళ్ళి పోయారు. ఒక్కక్షణం, మా అక్కయ్య నిశ్చేష్టురాలయ్యింది.

ఇంట్లో వస్తులు....మరునాడు క్యాంపుకని వెళ్ళిన మా బావయ్య మళ్ళీ యీ నాటివరకూ తిరిగిరాలేదు. తనకోసం ఎదురుచూడవద్దనీ, వెతికించటం వృధా అనీ; ఆస్తిపాస్తులు, కొడుకులకూ, మా అక్కయ్యకూ రాసియిచ్చి నట్టూ మా అక్కయ్య మంచీ, చెడూ, నన్ను చూస్తూ ఉండమనీ, మా అక్కయ్య అంటే తనకు జాలి తప్ప, కోపం లేదనీ, నాకు ఉత్తరం రాశాడు.

ఇది జరిగి పది సంవత్సరాలవుతుంది. మా బావయ్య దేవుడిలో చేరాడో....మనశ్శాంతి కోసం....ఏ పుణ్యక్షేత్రంలోనైనా దేవుడి పాదపూజలో నిమగ్నుడై జీవితాన్ని సాగిస్తు న్నాడో....ఏమో....నాకు తెలియదు....దీపా వళి పండుగప్పుడు, ఆ శాంతమూర్తి ....మా బావయ్య....నా కళ్ళముందు కదులుతూ వుంటాడు. నాకు తెలియకుండానే, ఆయన కోసం, రెండు కన్నీటి బిందువులు నా కళ్ళ నుండి రాలతాయి.

***